మళ్లీ సీఎంగా జగన్ కావాలి

నున్న(విజయవాడరూరల్): రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని జెడ్పీటీసీ సభ్యురాలు కె.సువర్ణరాజు అన్నారు. నున్న గ్రామ సచివాలయం–2లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సువర్ణరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ పేద, బడుగు వర్గాల ప్రజానీకానికి ముందెన్నడూ లేనివిధంగా అనేక పథకాలను అమలు చేయడంతో పాటు మహిళా సాధికారితకు అగ్రస్థానం కల్పించారని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి ఆరోగ్యశ్రీ కార్డు వున్న ప్రతీ కుటుంబానికి రూ. 25లక్షల వరకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, పార్టీ రూరల్ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, గ్రామ ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, కన్వీనరు దుర్గారెడ్డి, పార్టీ నాయకులు, సచివాలయ కార్యదర్శి అజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

ముస్తాబాద సచివాలయం–2లో..

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద సచివాలయం–2 పరిధిలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును పార్టీ నాయకులు అధికారులతో కలసి ఆవిష్కరించారు. జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచి వేము రాధాకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నీలం ప్రవీణ్‌కుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ కైలే శివకుమార్, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గూటాల భాగ్యరాజ్, సహకార బ్యాంకు చైర్మన్ మేడసాని శ్రీనివాస్‌చౌదరి, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మీ, సచివాలయం సిబ్బంది, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నున్నలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



ముస్తాబాదలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

క్లుప్తంగా

నేడు ఆడుదాం ఆంధ్రా స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆడుదాం ఆంధ్రా పోటీలకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేది నుంచి గ్రామ సచివాలయ స్థాయిలో ఆడుదాం ఆంధ్ర పోటీలు ప్రారంభంకానున్నాయని పేర్కొన్నారు. ఈ పోటీల నిర్వహణకు అవసరమైన కిట్లు ఇప్పటికే మండల పరిషత్ కార్యాలయానికి చేరుకున్నాయని చెప్పారు. బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ చేతుల మీదుగా కిట్లను సచివాలయాలకు అందజేయనున్నట్లు వివరించారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఆంజనేయస్వామికి తమలపాకులతో అర్చన



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆంజనేయస్వామికి తమలపాకులతో సహస్రనామార్చనలు మంగళవారం నిర్వహించారు. కార్తికమాసం అమావాస్య సందర్భంగా ఆలయ అర్చకుడు ఎస్.రామాచార్యులు ఆంజనేయస్వామికి 25వేల తమలపాకులతో అర్చన పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ప్రసిద్ధ అభయాంజనేయస్వామివారి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మారుతి రైస్‌ట్రేడర్స్ అధినేత పొట్లూరి వెంకటేశ్వరరావు వితరణతో అన్నదానం జరిగింది. ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

పెనమలూరు: యనమలకుదురు సెక్షన్ పరిధిలో విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు మాట్లాడుతూ విద్యుత్ విజిలెన్స్ అధికారులు యనమలకుదురు, తాడిగడప, పెదపులిపాక గ్రామాల్లో 36 బృందాలుగా ఏర్పడి 3069 విద్యుత్ సర్వీసులు తనిఖీ చేశారని అన్నారు. తనిఖీల్లో అధిక లోడ్ వినియోగిస్తున్న 119 మంది వినియోగదారులకు రూ. 3.94 లక్షలు అపరాధ రుసుము విధించామని తెలిపారు. విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే 9493174266 నెంబర్‌కు ఫోన్ చేసి వివరాలు తెలపాలని కోరారు. కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ జి.కమలకుమారి, డెప్యూటీ ఈఈ ఎం.పూర్ణచంద్రరావు, ఏఈ రామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం

పెనమలూరు: కానూరులో యువకుడు అదృశ్యంపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం కానూరు తులసీనగర్‌కు చెందిన కుగంటి నీలాపూర్ణ ఇంటికి ఈ నెల 9న ఖమ్మం జిల్లా డోర్నకల్‌కు చెందిన ఆమె మేనల్లుడు గురువిందపల్లి హేమంత్‌కుమార్(21) వచ్చాడు. అయితే అతనికి మతిస్థిమితం సరిగా లేకపోవడంతో మందులు వాడుతున్నారు. ఈ నేపథ్యంలో హేమంత్‌కుమార్ ఈ నెల 11న ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని కోసం బంధువులు, కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కోడిపందేల శిబిరంపై దాడులు

కంకిపాడు: కోడిపందేల శిబిరంపై సోమవారం అర్ధరాత్రి కంకిపాడు పోలీసులు దాడులు జరిపారు. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన కథనం మేరకు మండలంలోని తెన్నేరుగ్రామ శివారు ఖాళీ ప్రదేశంలో కోడిపందేలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో అర్ధరాత్రి 1 గంట సమయంలో పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి ఒక పందెం కోడి, 38 కోడి కత్తులు, రూ. 23,770 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మౌలిక వసతులను విస్మరిస్తే సహించేది లేదు

కంకిపాడు: మౌలిక వసతుల కల్పన విస్మరిస్తే సహించేది లేదని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు, మంతెన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను విద్యాశాఖ అధికారులు, పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. మంతెన జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యత పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాడు–నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధికి నిధులు కేటాయించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేడంద్రావు కుటుంబరావు, మద్దూరు ఎంపీటీసీ సభ్యుడు వడుగు శ్రీనివాసరావు, మంతెన సర్పంచి వీరంకి వెంకటరమణ, ఎంఈఓలు శేషగిరిరావు, కేఎస్‌వీ ప్రసాద్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంతెన జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు

నున్నలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ సచివాలయం–2లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పీఎం కిసాన్ సమృద్ధి కేంద్రాల ద్వారా రైతులకు అందజేస్తున్న సేవలను వ్యవసాయ సహాయకురాలు మౌనిక తెలియజేశారు. పీఎం గరీబ్‌కల్యాణ్ అన్నయోజన, పీఎం జనారోగ్య యోజన వంటి పలు కేంద్ర పథకాలపై సమీక్షించారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, గ్రామ పార్టీ కన్వీనర్ పోలారెడ్డి చంద్రారెడ్డి, గ్రామ వ్యవసాయ కమిటీ చైర్మన్ అవుతు వీరారెడ్డి, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ మోహన్, సప్తగిరి బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణ, పలు శాఖల అధికారులు, గ్రామ కార్యదర్శి జీటీవీ రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉంగుటూరులో..

ఉంగుటూరు: మండలంలోని చికినాల, బొకినాల గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శేషగిరిరావు పలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అమీర్‌బాషా, ఎంఈఓ–2 సాంబశివరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మద్దూరులో కార్తిక అన్న సమారాధన

కంకిపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలోని ఏటిపాయ శివ మందిరం ప్రాంగణంలో కార్తిక అన్న సమారాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు శివాలయంలో పూజలు నిర్వహించి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణస్వామి దంపతులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాన్ని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గొంది శివరామకృష్ణ ప్రసాద్, మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తుమ్మలపల్లి హరికృష్ణ, డాక్టర్ కామినేని శ్రీధర్, జీఎం సునీల్ పర్యవేక్షించారు.

నున్నలో ఘనంగా దీపోత్సవం...

నున్న(విజయవాడరూరల్): కార్తిక మాసం ముగింపును పురస్కరించుకొని నున్న గ్రామంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆకాశ దీపాన్ని వెలిగించిన అనంతరం ఆలయంలోనూ, ప్రధాన రహదారిపైనా భక్తులు దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా సత్యనారాయణపురంకు చెందిన కనకదుర్గా నృత్య మందిర్ ఆధ్వర్యంలో చిన్నారులు కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చారు.

వైభవంగా చండీహోమం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో కార్తిక అమావాస్య సందర్భంగా అమ్మవార్లకు చండీ హోమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో హోమగుండాన్ని ఏర్పాటు చేసి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పలు గ్రామాల భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ చైర్మన్ బోయిన భానుప్రదీప్, ఈఓ పి.లోకేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



శివలింగానికి పూజలు చేస్తున్న పాండిచ్చేరి మాజీ సీఎం నారాయణస్వామి దంపతులు, భక్తులు



నున్న శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో దీపోత్సవం

నేడు డయల్ యువర్ డీఎం

గన్నవరం: స్థానిక ఆర్టీసీ డిపోలో బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం పి.శివాజీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలో నడుస్తున్న ఆర్టీసీ బస్సు సర్వీస్‌లకు సంబంధించిన సలహాలు, సూచనలు, సమస్యలను 8790996090 నెంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతులను ఆదుకునే దిశగా చర్యలు

ఉయ్యూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులను ఆదుకునే దిశగా చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. మండలంలోని ఆకునూరు గ్రామం పంట పొలాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. తడిచిన వరి పనలు, దెబ్బతిన్న ధాన్యాన్ని పరిశీలించి రైతులను అడిగి నష్టం వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ పంట నష్టం సర్వే జరుగుతోందని నష్టపోయిన ప్రతీ రైతుని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వాస్తవాలు తెలుసుకోకుండా బురద రాజకీయాలు చేయడం ఆయన రాజకీయ అవివేకానికి నిదర్శనమన్నారు. పగటి వేషగాళ్ల మాటలు ప్రజలు నమ్మొద్దని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దాసే రవి, ప్రధాన కార్యదర్శి గారపాటి నాని, నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, మెరుగుమాల ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టం నమోదు ప్రక్రియ పరిశీలన

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాదలో వ్యవసాయ శాఖ ఏడీఏ ఎం.సునీల్, ఏఓ ఎస్ఎల్ తేజస్వీ పంట నష్టంపై వివరాల నమోదు ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ నెల 18 వరకూ పంట నష్టం నమోదు చేసి జాబితాను ఆర్బీకేల వద్ద అందుబాటులో ఉంచుతామని చెప్పారు. 22వ తేదీలోగా ఆఖరి జాబితాను సిద్ధం చేయాలని వీఏఏలను ఆదేశించారు. హెక్టారుకు రూ.17వేలు నష్ట పరిహారం ప్రభుత్వం ఇస్తుందని, రైతులు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు. వీఏఏ లక్ష్మణరావు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



ఆకునూరులో వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

సమగ్రంగా ఎన్యూమరేషన్ చేయాలి

పెనమలూరు: రైతులకు ఇబ్బంది లేకుండా పంట నష్టంపై సమగ్రంగా ఎన్యూమరేషన్ చేయాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య అన్నారు. పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో వీఏఏ, వీఆర్వోలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ నెల 18 నాటికి ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని సూచించారు. 19 నుంచి 22వ తేదీ వరకు సోషల్ ఆడిట్ ఉంటుందని తగిన జాగ్రత్తలు తీసుకొని ఎన్యూమరేషన్ పూర్తి చేయాలని తెలిపారు. మండల ఏఓ కనకమేడల శైలజ, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యంలో తేమ శాతం తగ్గించాలి

పెనమలూరు: ధాన్యంలో తేమ శాతం తగ్గించే విధంగా రైతులు చర్యలు తీసుకోవాలని మండల ఏఓ కనకమేడల శైలజ అన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో పర్యటించిన ఆమె రైతులకు తగిన సూచనలు ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర రావాలంటే ధాన్యంలో తేమశాతం 17కు మించకుండా ఉండాలని చెప్పారు.

తెంపల్లిలో..

గన్నవరం రూరల్: తెంపల్లి తుమ్మలచెరువు పరిధిలో వరి పొలాలను తెంపల్లి సర్పంచి కొలుసు శిరీషా మంగళవారం పరిశీలించారు. ప్రభుత్వం ప్రతి ధాన్యం గింజను కొంటుందని ఆమె చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, వీఏఏ శివనాగరాజు, రైతులు పాల్గొన్నారు.

నున్నలో పంట పొలాల పరిశీలన

నున్న(విజయవాడరూరల్): తుఫాన్‌తో నష్టపోయిన పంట పొలాలను వ్యవసాయ, రెవిన్యూ అధికారులు మంగళవారం పరిశీలించారు. నున్న గ్రామంలో సుమారు 600 ఎకరాల పంట పొలాలు పడిపోయి నీటిలో ఉండటాన్ని అధికారులు గుర్తించారు. ఎన్యూమరేషన్‌లో వీఆర్వోలు శ్రీనివాసరావు, చాంద్, రైతులు గ్రామ వ్యవసాయ సహాయకురాలు మౌనిక పాల్గొన్నారు.



పెనమలూరులో వీఏఏ, వీఆర్వోలతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివయ్య



ధాన్యం పరిశీలిస్తున్న ఏఓ శైలజ

సున్నా వడ్డీతో డ్వాక్రా సంఘాలు బలోపేతం

ఉంగుటూరు: ప్రభుత్వం అమలు చేస్తున్న సున్నావడ్డీ పథకం ద్వారా డ్వాక్రా సంఘాలు మరింత బలోపేతం అవుతున్నాయి. సంఘం సభ్యులు తీసుకున్న రుణాలపై బ్యాంకులకు పావలా వడ్డీ చెల్లించాలి. ఈ వడ్డీని ప్రభుత్వం సున్నావడ్డీ పేరుతో మహిళల ఖాతలకు జమచేస్తోంది. ఫలితంగా మహిళలు తీసుకున్న రుణం మాత్రమే బ్యాంకులకు వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నారు. దీంతో మహిళలపై వడ్డీ భారం తగ్గింది. 2019 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారులు సున్నావడ్డీ పథకం అమలు చేస్తున్నారు. ఉంగుటూరు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో మొత్తం 13,221 మంది సున్నావడ్డీ లబ్ధిదారులు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ. 2.62 కోట్లు అందజేసింది. టీడీపీ హయాంలో రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి డ్వాక్రా సంఘాలను చంద్రబాబు అప్పుల ఊబిలో ముంచేశారు. ఫలితంగా బ్యాంక్ మేనేజర్లు రుణంతో పాటు వడ్డీ చెల్లించాలని మహిళలకు నోటీస్‌లు పంపించారు. దీనివల్ల గత్యంతరంలేక పేరుకుపోయిన వడ్డీ చెల్లించలేక లబ్ధిదారులు నానా అగచాట్లు పడ్డారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేస్తూ క్రమం తప్పకుండా సున్నావడ్డీ చెల్లిస్తున్నారు. దీంతో డ్వాక్రా సంఘాల సభ్యులకు కొండంత ధైర్యం వచ్చింది. ఇప్పటికే ఆసరా పథకం ద్వారా 11,200 మంది మహిళలు రూ. 29.28 కోట్లు అందుకున్న సంగతి తెలిసిందే. జనవరిలో నాల్గవ విడత ఆసరా డబ్బులు మహిళల ఖాతాలో జమ వుతాయని ఏపీఎం సాంబశివరావు తెలిపారు.



ఉంగుటూరులో సున్నా వడ్డీ లబ్ధిదారులు

మహిళలకు మేలు జరిగింది



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు చాలా మేలు జరిగింది. మా డ్వాక్రా సంఘం రుణం డబ్బులు సగానికి పైగా చెల్లించారు. సున్నావడ్డీ మా ఖాతాల్లో జమ చేస్తున్నారు. సీఎం జగన్ డబ్బులు ఇస్తారనే ధైర్యం మాలో కలిగింది. లేకపోతే చాలా ఇబ్బందులు పడేవాళ్లం.

– నాగనబోయిన శ్రీలక్ష్మి, వేంపాడు

మాట నిలబెట్టుకున్నారు



సీఎం జగనన్న ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. డ్వాక్రా సంఘం తీసుకున్న రుణంకు సున్నావడ్డీ డబ్బులు ఏటా జమ చేస్తున్నారు. మాకు చాలా సంతోషంగా ఉంది. ఇవే కాకుండా వైఎస్సార్ సీపీ పాలనలో సంక్షేమ పథకాలన్నీ మహిళ పేరున మంజూరు చేయడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోంది.

– గంపా భూలక్ష్మి, మండల సమైఖ్య అధ్యక్షురాలు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన, డెమో పక్రియను స్పెషల్ సీఎస్ బి.రాజశేఖర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా యంత్రాల పనితీరు, ఓటు వేసే విధానాన్ని డెమో ద్వారా వివరించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ఎంతో విలువైందని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటు వేసే విధానంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ పి.కోటేశ్వరరావు, పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎ.సూర్యకుమారి, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, డ్వామా పీడీ జె.సునీత, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ జయచంద్ర, ఎంపీడీఓ భార్గవి, తహసీల్దార్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును పరిశీలిస్తున్న స్పెషల్ సీఎస్ రాజశేఖర్ తదితరులు

పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో...

పెనమలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎంపై ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఓటర్లు ఈవీఎంపై ఓటు వినియోగించుకునే విధానంపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ కట్టా వెంకటశివయ్య సూచించారు.

గ్రామీణ తపాలా సేవకుల ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: గ్రామీణ తపాలా సేవకులు తమ డిమాండ్ల పరిష్కారానికై హనుమాన్‌జంక్షన్ సబ్ పోస్టాఫీస్ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఆల్ ఇండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ పిలుపు మేరకు దేశవ్యాప్త నిరవధిక సమ్మెలో భాగంగా తపాలా కార్మికులు విధులు బహిష్కరించి ఆందోళనకు దిగారు. గ్రామీణ డాక్ సేవక్‌లకు సివిల్ సర్వెంట్ హోదా, ఎనిమిది గంటల పని కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాడ్యూటీ రూ.5 లక్షలకు పెంచాలని, కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్స్‌లు అమలు చేయాలని కోరారు. గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు కేవీఎస్ సత్యనారాయణ, వేదనాయకం, పి.నాగేశ్వరరావు, సీహెచ్ ఈశ్వరరావు, పి.సుభానిఖాన్, ఎం.విజయకుమార్ పాల్గొన్నారు.

ఊపందుకున్న సంరక్షణ చర్యలు



కంకిపాడులో వరి పనలు ఆరబెడుతున్న కూలీలు

తుపాను నష్టం నుంచి రైతాంగం కోలుకుంటోంది. పంట సంరక్షణ చర్యల్లో నిమగ్నమవుతోంది. తడిచిన వరి పనలను ఆరబెట్టి కుప్పలు వేస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధాన్యం ఆరబోసి, ఎండిన ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తున్నారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో వరి కోతలు కూడా ఊపందుకుంటున్నాయి. – కంకిపాడు



పునాదిపాడు ఫ్లైఓవర్ వద్ద ధాన్యం కాటా వేస్తున్న కూలీలు



మంతెనలో మిల్లుకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు